# సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025


I

## ఆకాశ విహారం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రథ సప్తమి వేడుకల సందర్భంగా ఆదివారం నుంచి 4వ తేదీ వరకు శ్రీకాకుళం నగరంలోని 'డచ్' భవనం ప్రాంగణంలో హెలికాప్టర్ ద్వారా విహరించే అవకాశాన్ని ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాటు చేసింది.




డచ్ భవనం వద్ద హెలికాప్టర్


- ప్రతి ట్రిప్పు 5 నిమిషాలుగా నిర్ణయించారు.
- ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.1800
- రెండేళ్ల లోపు పిల్లలకు ప్రవేశం లేదు.
- ఈ టికెట్లను హెలికాప్టర్ రైడ్ టికెట్స్ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలి.
- ఆన్‌లైన్ ద్వారా టికెట్స్ పొందడం తెలియని ప్రజల కోసం శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ని ఏర్పాటు చేశారు.

**టికెట్ల బుకింగ్ కోసం**

https://heliride.arasavallisungod.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

### అపు'రూప' ప్రతిభ





సూర్యనారాయణుని జయంత్యుత్సవాల సందర్భంగా ప్రముఖ చిత్రకారుడు రాహుల్ పట్నాయిక్ అపురూప చిత్రాలను తీర్చిదిద్దారు. నెమలి పింఛంపై ఒక చిత్రాన్ని, రావి ఆకుపై మరో చిత్రాన్ని గీశారు. నగరంలోని అరసవల్లికి చెందిన రాహుల్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఎన్నో పురస్కారాలను అందుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

# వెలుగుల రేడు... వేడుక చూడు



- నేటి నుంచే రథ సప్తమి మహోత్సవాలు
- రాష్ట్ర పండుగగా రథసప్తమి ఏర్పాట్లు
- నేడు 3 వేల మందితో సూర్యనమస్కారాలు
- మధ్యాహ్నం 2.30 గంటల నుంచి శోభాయాత్ర
- తొలిసారిగా మూడు రోజుల పాటు హెలికాప్టర్ టూరిజం
- 3వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆదిత్యుని క్షీరాభిషేకం

అరసవల్లి:

వెలుగుల రేడు వేడుకకు సిక్కోలు సిద్ధమైంది. రథసప్తమి మహోత్సవాన్ని తొలిసారిగా రాష్ట్ర పండుగగా జరిపేందుకు నిర్ణయించడంతో.. అన్ని ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయి. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు మహోత్సవాలను నిర్వహించేందుకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారుల బృందాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ప్రదర్శనలకు ఉచిత ప్రవేశాలను కల్పిస్తున్నట్లుగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ప్రకటించారు. 3వ తేదీ అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ఆదిత్యుని గర్భాలయంలోని మూలవిరాట్టుకు క్షీరాభిషేక సేవ చేయనున్నారు. అలాగే 4వ తేదీ ఉదయం 7 గంటల వరకు స్వామి అభిషేక మూర్తి నిజరూప దర్శనం.. స్వర్ణాలంకరణతో స్వామిని చూడవచ్చు.



రథసప్తమి వేడుకకు లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్న మహిళలు

### ఆదివారం షెడ్యూల్ ఇదే..

- ఉదయం 6 గంటలకు 80 ఫీట్ రోడ్డులో సామూహిక సూర్యనమస్కారాలు.
- ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డచ్ భవనం వద్ద హెలికాప్టర్ రైడ్ (టిక్కెట్లు ఉన్నవారే).
- 10 గంటల నుంచి ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో గ్రామీణ క్రీడా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు.
- మధ్యాహ్నం 2.30 గంటల నుంచి డేఅండ్ నైట్ కూడలి నుంచి అరసవల్లి వరకు శోభయాత్ర..దారి పొడవునా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు.
- సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు.
- సాయంత్రం 5 గంటల నుంచి వరుసగా ఆరోహి స్కూల్ ఆఫ్ మ్యూజిక్, దుంపల ఈశ్వర్ సినీ సంగీత బృందం, యామినీ కృష్ణ శాస్త్రీయ సంగీత బృందం, పరిమళ బృంద జానపద నృత్యాలు, అనూరాధ బృందం శాస్త్రీయ నృత్యాలు, లక్ష్మీగణపతి శర్మ సినీ శాస్త్రీయ సంగీత బృందం, పలువురు హాస్యనటుల ధూంధాం..అనంతరం చివరగా...రాత్రి 10 గంటలకు 'పంచ రత్నాలు' పేరిట పౌరాణిక డ్రామా ఉంటాయి.
- రాత్రి 7 నుంచి 8 గంటలకు లేజర్ షో.

## దాతలంటే అంత అలుసా..?

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి దాతలే అభివృద్ధి ప్రదాతలు. కానీ వారు ఇప్పుడు అధికారులకు అలుసైపోయారు. ఇంతవరకు రూ.లక్ష వరకు విరాళాలిచ్చిన దాతలకు రథ సప్తమి వేళల్లో ఒక్కో డోనర్ పాసును ఇచ్చేవారు. కానీ దాతల ప్రాధాన్యతను ఎలాగైనా తగ్గించేందుకు కుట్ర పన్నారో ఏమో గానీ 'ఒక పేరుకు ఒకే పాసు' విధానం అమలు చేశారు. ముందస్తుగా ఎలాంటి సమాచారం లేకుండా ఈ విధానాన్ని అమలు చేయడంతో దాతలు తీవ్ర ఇబ్బందులు పడడంతో పాటు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం నుంచి దాతల పాసుల పంపిణీని ప్రారంభించారు. అయితే రూ.లక్ష ఇచ్చిన వారికి ఒక పాసు ఇస్తున్నారు. అదే రూ.4 లక్షలిస్తే రెండు పాసులిచ్చి పంపించేస్తున్నారు. అలాగే రూ.10 లక్షల వరకు విరాళాలిచ్చిన వారికి కేవలం ఐదు పాసులివ్వడాన్ని దాతలు జీర్ణించుకోలేకపోతున్నారు.



పాసుల కోసం గుమిగూడిన దాతలు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న దాత నాగరాజు

### పాసులు తగ్గించి ఇస్తే.. ఊరుకునేది లేదు

అరసవల్లి ఆలయానికి అవసరమైనప్పుడు సంప్రదించిన ప్రతిసారీ నాలుగు దఫాలుగా రూ.లక్ష చొప్పున నాలుగు లక్షలు ఇచ్చాను. గత ఏడాది నాలుగు పాసులు ఇచ్చారు. ఇప్పుడు కేవలం రెండు పాసులు ఇస్తున్నారు. నాకు వద్దు... నాలుగు పాసులు ఇవ్వాల్సిందే అని పట్టుబట్టాను. జిల్లా కలెక్టర్‌కు అడిగినా పెద్ద స్పందన లేకపోవడం దారుణం. – మెట్ట నాగరాజు, రూ.4 లక్షలిచ్చిన దాత

### నేటి నుంచి టికెట్ల విక్రయాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రథ సప్తమి పర్వదినం సందర్భంగా మూడో తేదీ అర్ధరాత్రి నుంచి స్వామి నిజరూప దర్శనం కనువిందు చేయనుంది. ఈ సందర్భంగా వివిధ రకాల టికెట్లను అందుబాటులో ఉంచామని జిల్లా రెవెన్యూ అధికారి తెలిపారు.

- **రూ.100 దర్శన టికెట్లు:** అరసవల్లి దేవాలయ ప్రాంగణంలోని కౌంటర్‌లో లభిస్తాయి. (ఒక్కరికి మాత్రమే ప్రవేశం)
- **రూ.300 దర్శన టికెట్లు:** అరసవల్లి దేవాలయ ప్రాంగణంలోని కౌంటర్‌లో లభిస్తాయి. (ఒక్కరికి మాత్రమే)
- **రూ. 500 క్షీరాభిషేకం టికెట్లు:** అరసవల్లి దేవాలయ ప్రాంగణంలోని కౌంటర్లో లభిస్తాయి. (ఇద్దరికి మాత్రమే).
- ఫిబ్రవరి 4వ తేదీ తెల్లవారు జాము ఒంటి గంట నుంచి 6 గంటల వరకు..
- **రూ.300 దర్శన టికెట్లు (జిల్లా అధికారులు, ఇతర ఉన్నత అధికారులకు):** యూనియన్ బ్యాంక్, అరసవల్లిలో లభిస్తాయి. దీనికి శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్ అధికారి అనుమతి తప్పనిసరి. ఫిబ్రవరి 4వ తేదీ ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే ఈ టికెట్లపై దర్శనం చేయవచ్చు.
- భక్తులు ఈ టికెట్లను ఒక్కరోజు ముందుగానే డబ్బులు చెల్లించి పొందవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆవరణమంతా.. మందు బాబుల సంత

- మహిళా కళాశాల ప్రాంగణంలో మద్యం బాటిళ్లు
- ఆందోళనకు గురి చేస్తున్న అక్కడి పరిస్థితులు
- అక్కడే ఆరు విద్యార్థినుల వసతి గృహాలు
- గురువారం రాత్రి విద్యార్థినిపై జరిగిన దాడి కూడా అక్కడే



మహిళా కళాశాల ప్రిన్సిపాల్ బ్లాక్ పక్కన వాటర్ ట్యాంక్ దగ్గర కాస్త ఖాళీగా ఉన్న స్థలమిది. ఈ స్థలంలో మెక్ డోవల్, ఇంపీరియల్ బ్లూ అనే పేరు గల ఖాళీ మద్యం బాటిళ్లు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాల ప్రాంగణం. అది కూడా మహిళా కళాశాల. దాని పక్కనే బీసీ, ఎస్సీ1, ఎస్సీ2, ఎస్సీ3, ఎస్టీ, దివ్యాంగుల మహిళా హాస్టల్స్ ఉన్నాయి. దాదాపు 2వేల మందికి పైగా ఆడపిల్లలు ఉండే ప్రాంగణంలో మద్యం బాటిళ్లు కనిపించడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. క్యాంటిన్ దగ్గర కూడా మద్యం బాటిళ్లు దర్శనమిచ్చాయి.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లా కేంద్రంలోని మహిళా కళాశాల పరిస్థితులు ఆందోళనకు గురి చేస్తున్నాయి. బయటకు వ్యక్తులు లోపలకు ప్రవేశించి మద్యపానం చేస్తున్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఇక్కడ జూనియర్, డిగ్రీ కళాశాలలు నడుస్తున్నాయి. అలాగే ఆరు విద్యార్థినుల హాస్టళ్లు ఉన్నాయి. దాదాపు 1248 మంది హాస్టల్ వి ద్యార్థులున్న చోట నిర్వాహకులు ఎంతో జాగ్రత్తగా ఉండాలి. కానీ ఇక్కడి పరిస్థితులు చూస్తుంటే జాగ్రత్త అన్నదే కనిపించడం లేదు. సాధారణంగా క ళాశాలకు వాచ్‌మెన్‌లు ఉంటారు. హాస్టల్స్‌కు కూడా రొటేషన్ పద్ధతిలో ఉన్న సిబ్బందిలో ఒకరు వాచ్‌మెన్‌గా రాత్రిపూట విధులు నిర్వర్తిస్తుంటారు. వీరంతా మద్యం బాటిళ్లతో వచ్చే వారిని కట్టడి చేయలేకపోతున్నారా? లేదంటే భయపడి చూసీచూడనట్టు వదిలేస్తున్నారా? అన్నది అంతు చిక్కడం లేదు. కాలేజీ ప్రాంగణంలోకి ఎవరు మద్యం బాటిళ్లతో వె ళ్తున్నారో తేలాల్సిన అవసరం ఉంది.

**విద్యుత్ వెలుగులు అంతంతమాత్రమే..**

జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఆడపిల్లలు ఇక్కడ చదువుతున్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని తమ పిల్లల్ని ఇక్కడ చేర్పిస్తున్నారు. కళాశాల పక్కనే హాస్టల్స్ ఉండటంతో తమ పిల్లలకు భద్రత ఉంటుందని భావిస్తూ ధీమాగా ఉంటారు. కానీ ఇక్కడున్న పరిస్థితులు చూస్తుంటే తల్లిదండ్రులకు ఆందోళన కలగక మానదు. కళాశాల, హాస్టల్స్ ప్రాంగణానికి ప్రహరీ పూర్తిగా లేకపోవడమే కాదు విద్యుత్ సౌకర్యం కూడా పూర్తి స్థాయిలో లేదు. రాత్రయితే చీకట్లు అలుముకుంటాయి. ప్రాంగణానికి సరిపడా విద్యుత్ లైట్లు లేకపోవడం కూడా అక్కడున్న పరిస్థితులకు కారణం కావచ్చు.

**పోలీసు పహారా అవసరం**

మహిళా కళాశాల ప్రాంగణంలో ఉన్న లోపాలు, అక్కడ కనబడుతున్న మద్యం బాటిళ్లు చూస్తుంటే ఎప్పుడు ఏ అఘాయిత్యం జరగడానికైనా అవకాశం ఉంటుంది.

- దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించడమే కాకుండా ప్రభుత్వం కూడా అక్కడ పూర్తి స్థాయిలో ప్రహరీ, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.
- నగరం నడిబొడ్డున విద్యార్థినుల ఉన్న హాస్టల్స్ ఎక్కువగా ఉండటంతో ఇక్కడ భద్రత పెంచాలనే డిమాండ్ వినిపిస్తోంది.
- రాత్రిపూట గస్తీ ఉండాలి. ఆడపిల్లలు ఉన్న హాసల్స్ వైపు బయట వ్యక్తులు వెళ్లకుండా చూడాలి.
- అక్కడ చదువుతున్న ఆడపిల్లలు కూడా జాగ్రత్తగా ఉండాలి. అక్కడే చదువుకుని, అక్కడే వసతి ఉండటంతో తప్పనిసరి అయితే తప్ప బయట తిరగడానికి ప్రయత్నించకూడదు.
- ఇప్పటికే నగరంలో గంజాయి బ్యాచ్ తిరుగుతోంది. దానికి తోడు మందు బాబులు ఎక్కువయ్యారు. ఈ సమయంలో హాస్టళ్లలో జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరం.

### చర్యలు చేపడతాం..

డిగ్రీ కళాశాలతో పాటు జూనియర్ కళాశాల ఉన్న ఇదే ప్రాంగణంలో 6 వసతి గృహాలు ఉన్నాయి. ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు ఉంటున్నారు. ఇంతమందిని పర్యవేక్షించే పరిస్థితి లేదు. లోపల నిర్మాణ పనులు జరగడం.. విద్యార్థుల సంబంధీకులు రాకపోకలు సాగించడంతో ఎవరి మీద ప్రత్యేక దృష్టిసారించే అవకాశం లేదు. లైట్లు కొన్ని వెలగకుంటే కొన్నింటి మరమ్మతులు చేపట్టాం. మద్యం బాటిళ్ల సంగతి నా దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి చర్యలు చేపడతాం.

–డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు, మహిళా కళాశాల ప్రిన్సిపాల్

**ఆగమేఘాల మీద చర్యలు..**

- దాడి ఘటన నేపథ్యంలో హాస్టల్స్ వద్ద అత్యవసరంగా మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.
- కళాశాలలోని ప్రిన్సిపాల్ బ్లాక్‌లో మాత్రమే వాచ్ మెన్ ఉన్నారు. మిగతా ప్రాంగణం.. వసతి గృహాల వద్ద వాచ్‌మెన్ లేరు. ఒక హోంగార్డును నియమించాలని ఆయన జీతభత్యాలు బీసీవెల్ఫేర్ తరఫున చెల్లిస్తామని బీసీ వెల్ఫేర్ అధికారిణి కలెక్టర్ దృష్టికి వెళ్లారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.
- అలాగే విద్యుత్ లైట్లు వెలిగేలా సత్వర చర్యలు తీసుకున్నారు.

# ఆందోళన.. ఆగ్రహం.. బుజ్జగింపు



విద్యార్థులను సముదాయిస్తున్న ఎమ్మెల్యే శంకర్



కలెక్టరేట్ ఎదుట విద్యార్థినుల ధర్నా



విద్యార్థినులతో ఎస్పీ ముఖాముఖి

## విద్యార్థినిపై దాడి కేసులో ఆసక్తికర పరిణామాలు

- పోలీసుల అదుపులో అనుమానితుడు?
- శనివారం రోడ్డెక్కిన విద్యార్థులు
- వార్డెన్‌పై సస్పెన్షన్ ఎత్తి వేయాలని, నిందితుడిని శిక్షించాలని డిమాండ్
- సీరియస్ అయిన స్థానిక ఎమ్మెల్యే
- విద్యార్థులతో మాట్లాడిన ఎస్పీ మహేశ్వరరెడ్డి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

శ్రీకాకుళం మహిళా కళాశాల ప్రాంగణంలో డిగ్రీ విద్యార్థినిపై జరిగిన దాడి వ్యవహారంలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఘటన జరిగాక వార్డెన్‌పై సస్పెన్షన్ వద్దని, నిందితుడిని శిక్షించాలని విద్యార్థులు శనివారం ఆందోళన చేశారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనక ఎస్పీ వచ్చి విద్యార్థులందరితో మాట్లాడారు. వివరాల్లోకి వెళితే..

ఘటన నేపథ్యంలో బాలిక హాస్టల్ వార్డెన్‌ను శుక్రవారం సాయంత్రం కలెక్టర్ సస్పెండ్ చేశారు. తెల్లవారేసరికి ఆ హాస్టల్‌లో చదువుతున్న మిగతా విద్యార్థులు రోడ్డెక్కారు. తమ వార్డెన్‌పై సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని, దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వం డౌన్ డౌన్ అని నినాదాలు చేస్తూ మహిళా కళాశాల గేట్ దగ్గర నిరసన తెలియజేశారు. దీంతో అటువైపుగా వెళ్తున్న సమయంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ వారి వద్దకు వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరడం సరికాదని, నిందితుడిని తప్పనిసరిగా శిక్షిస్తామని నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ విద్యార్థులు వెనక్కి తగ్గకుండా నగరంలో ప్లకార్డులతో నిరసన ర్యాలీ చేయడమే కాకుండా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు.



ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్తున్న విద్యార్థినులు

**అదుపులో అనుమానితుడు?**

గురువారం రాత్రి విద్యార్థిపై జరిగిన దాడి ఘటన నేపథ్యంలో పోలీసులు శుక్రవారం అప్రమత్తమై, నాలుగు బృందాలుగా ఏర్పడి, అనుమానిత వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టుగా ప్రచారంలోకి వచ్చింది. ఇదే సమయంలో ఒక్కసారిగా హాస్టల్ విద్యార్థులు నిరసనకు దిగడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే వార్డెన్ విధుల్లో ఉంటే విచారణ సరిగా జరిగే అవకాశం ఉండదని స్థానిక ఎమ్మెల్యే విద్యార్థులకు వివరించారు. వార్డెన్ తప్పు లేకపోతే సస్పెన్షన్ ఎత్తివేయడం జరుగుతుందని ఎమ్మెల్యే వివరించారు. కానీ, ఆ విద్యార్థులు వినలేదు. నిరసన ర్యాలీ చేయడానికే సిద్ధమయ్యారు. దీంతో ఎమ్మెల్యే గొండు శంకర్ సీరియస్‌గా తీసుకున్నారు. పరీక్షలు అవుతున్న వేళ, హాస్టల్‌లో ఉండాల్సిన సమయంలో విద్యార్థులు బయటకు రావడమేంటని, అనుమతి లేకుండా నిరసనలకు దిగడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైతే నిరసన ర్యాలీ చేశారో వారిపై చర్యలు తీసుకోవాలని బీసీ వెల్ఫేర్ అధికారులతో పాటు కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అంతేకాకుండా ఇక్కడ జరిగిన విషయాన్ని కలెక్టర్‌కు కూడా ఎమ్మెల్యే వివరించారు. సస్పెన్షన్‌కు గురైన పూర్వ స్థానంలో ఆ ప్రాంగణంలో ఎస్సీ హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న సరితకు ఇన్‌చార్జి ఇవ్వాలని కూడా సిఫార్సు చేశారు.

**సమస్యలుంటే నిర్భయంగా చెప్పండి**

శ్రీకాకుళం క్రైమ్ : సమస్యలు ఉంటే నిర్భయంగా చెప్పాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న ఉమెన్స్ కళాశాల విద్యార్థినులకు సూచించారు. శనివారం సాయంత్రం ఎస్పీ ఇక్కడి విద్యార్థినులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. సమస్యలు ఉంటే తల్లిదండ్రులకు చెప్పాలని, వారికి చెప్పుకోలేని సమస్య అయితే పోలీసులకు తెలపాలని, నేరుగా తనను కూడా 6309990800 ఫోన్ నంబర్ ద్వారా నిర్భయంగా సంప్రదించవచ్చన్నారు.

### రాష్ట్ర ప్రజలను వంచించడమే..



కేంద్ర బడ్జెట్‌లో ఎక్కడా ఆంధ్రప్రదేశ్ ప్రస్తావన లేకపోవడం రాష్ట్ర ప్రజలను వంచించడమే. రాష్ట్రాల వారీగా విడుదల చేసిన జాబితాలోనూ ఏపీ ప్రస్తావన లేదు. కొత్త ప్రాజెక్టులేవీ ప్రకటించలేదు. అమరావతి, మెట్రో రైలు ఊసు కూడా లేదు. టీడీపీకి 21 మంది ఎంపీలు ఉన్నా.. కేంద్రం నుంచి బడ్జెట్‌లో ఏమీ కేటాయింపులు పొందలేకపోయారు.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

### ఏపీకి ఒరిగిందేమీ లేదు



కేంద్ర మంత్రి నిర్మలమ్మ ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ఏపీకి ఒరిగేది ఏమీ లేదు. కేంద్రానికి మద్దతు ఇస్తున్న ఎంపీలు సమాధానం చెప్పారు. కేంద్రంలో భాగస్వామిగా ఉండి నిధులు తీసుకురాలేకపోయారు. – ఎం.సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు

# సీతమ్మ శీతకన్ను





- కేంద్ర బడ్జెట్‌లో సిక్కోలుకు రిక్తహస్తం
- స్వల్పకాలిక ప్రయోజనాలు తప్ప ఒరిగిందేమీ లేదు
- కేటాయింపుల్లో కనిపించని ప్రస్తావన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: సీతమ్మ సిక్కోలుపై శీతకన్ను వేసినట్టుంది. కేంద్ర బడ్జెట్‌లో జిల్లాలోని కీలక ప్రాజెక్టులకు నిధులు దక్కలేదు. జిల్లా ఎంపీ రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రిగా ఉన్నా జిల్లాకు కేటాయింపులు తీసుకురావడంలో ఘోరంగా విఫలమయ్యారు. శనివారం కేంద్రమంత్రి నిర్మల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్వల్పకాలిక, వ్యక్తిగత ప్రయోజనాలు తప్ప అంతకుమించి ఏమీ లేవు. రూ.12 లక్షల వరకు వేతనదారులకు ట్యాక్స్ మినహాయింపు ఇవ్వడంతో జిల్లాలో 3,500 మందికి లబ్ధి చేకూరనుంది. జలజీవన్ మిషన్ పొడిగించడం వల్ల మరి కొన్ని ఇళ్లకు ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లు వచ్చే అవకాశం ఉంది. కిసాన్ క్రెడిట్ కార్డు లోన్ లిమిట్ రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడంతో జిల్లాలోని కొంతమంది రైతులకు కాస్త రుణ వెసులుబాటు పెరగనుంది.

**జిల్లాకు చోటు దక్కేనా..?**

రైతులకు ఉత్పాదకత సుస్థిరత, మార్కెట్ సౌలభ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్టు కేంద్రం ప్రకటించింది. తక్కువ ఉత్పాదకత, సగటు కంటే తక్కువ రుణ పరిమితులు ఉన్న 100 జిల్లాలను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం ధన్ ధాన్య కృషి యోజన ప్రారంభిస్తుంది. సుస్థిర వ్యవసాయం పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా, రుణ సౌలభ్యాన్ని మెరుగు పర్చడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చడమే ఈ పథకం లక్ష్యం. ఈ పథకంలో మన జిల్లాకు చోటు దక్కుతుందో లేదో చూడాలి. అలాగే దేశ వ్యాప్తంగా వైద్య సీట్లను పెంచబోతున్నట్టు వెల్లడించారు. మన జిల్లాలో ఉన్న ఏకైక ప్రభుత్వ మెడికల్ కళాశాలైన రిమ్స్‌కు మేలు జరుగుతుందేమో వేచి చూడాలి.

**జిల్లాకు నిరాశే..**

- జిల్లాలో కిడ్నీ ఆస్పత్రి ఉంది. దీనిపై పరిశోధనలకు కేంద్రం పైసా సాయం కూడా ప్రకటించకపోవడం శోచనీయం.
- కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో రాష్ట్రంలో రోడ్లు, వంతెనల నిర్మాణానికి రూ.240కోట్లు మాత్రమే కేటాయించింది. ఇందులో మనకెంత దక్కుతుందో చూడాలి.
- జిల్లాలో అమృత్ భారత్ పథకం కింద పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలో రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు గతంలోనే శ్రీకారం చుట్టారు. ఆ పనులే నత్తనడకన సాగుతుంటే.. కొత్త నిర్మాణాలపై ఎలాంటి ప్రకటన చేయలేదు.
- వైఎస్సార్‌సీపీ హయాంలో మొదలైన మూలపేట పోర్టు, బుడగట్లపాలెం పిషింగ్ హార్బర్, జెట్టీ నిర్మాణాలకు సాయం దక్కలేదు.

### ట్యాక్స్ జిమ్మిక్కులు..



వేతన జీవులకు భారీ ఊరట అని బాకా ఊదుతున్నారు. కానీ వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పాత రెజ్యూమ్‌లో ఈ టాక్స్ అసెస్‌మెంట్ పనికిరాదని, కొత్త రెజ్యూమ్ ప్రకారం ఇన్‌కమ్ టాక్స్ అసెస్‌మెంట్ చేసుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పారు. కొత్త రెజ్యూమ్‌లో ఏ రకమైన మినహాయింపులు ఉండవు.

– ఎస్వీ రమణమూర్తి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

### పోలవరం ప్రస్తావన లేదు



కేంద్ర బడ్జెట్‌లో పోలవరానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాల్సింది. మధ్య తరగతి వర్గం, ఉద్యోగులకు ఆదాయం పన్ను తగ్గించటం ఊరటనిచ్చే అంశం. గతంలో కంటే మెరుగ్గా ఈ ఊరట ఉంది. – ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, పూర్వపు వైస్ చాన్సలర్, బీఆర్ఏయూ

## మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం


మాట్లాడుతున్న నిర్మలాకుమారి

శ్రీకాకుళం అర్బన్: మహిళా ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని స్టేట్ ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ వి.నిర్మలకుమారి, స్టేట్ కన్వీనర్ పి.మాధవి తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం శ్రీకాకుళం వచ్చిన ఈ బృందం శ్రీకాకుళం ఎన్జీవో హోంలో విలేకరులతో మాట్లాడారు. మహిళా ఉద్యోగులు పనిచేసే చోట ఎదుర్కొంటున్న ఇబ్బందులు, లైంగిక వేధింపులు, సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఉమెన్ వింగ్ ప్రతినిధులు ఎం.రాజ్యలక్ష్మి, పి.సురేఖ, జి.హైమావతి, పి.శ్రావణి, కె.రోజారాణి, ఆర్.లలిత, కె.నారాయణమ్మ, పి.యశోద, జి.లలిత, మమతాకుమారి, ఏపీ ఎన్జీవో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, సెక్రటరీ చల్లా శ్రీను, అసోసియేట్ ప్రెసిడెంట్ రాయి వేణు తదితరులు పాల్గొన్నారు.

## మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా విజయ్


అవార్డు అందుకుంటున్న త్రిపురాణ విజయ్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన స్టార్ క్రికెటర్, ఐపీఎల్ క్రీడాకారుడు త్రిపురాణ విజయ్ రంజీ ట్రోఫీలో సత్తాచాటాడు. బీసీసీఐ ఆధ్వర్యంలో విజయనగరంలో జరిగిన మ్యాచ్‌లో విజయ్ స్పిన్‌తో రాణించడంతో ఆంధ్రా (ఏసీఏ) జట్టు రాజస్థాన్‌పై జయభేరి మోగించింది. మొదటి ఇన్నింగ్స్‌లో 27 ఓవర్లలో 62 పరుగులిచ్చి ఐదు కీలక వికెట్లు పడగొట్టగా, రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో విజృంభించాడు. మొత్తం పది వికెట్లు సాధించిన విజయ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు వరించింది. టెక్కలిలోని అయ్యప్పనగర్‌లో నివాసం ఉంటున్న త్రిపురాన వెంకట కృష్ణరాజు, లావణ్యల కుమారుడైన విజయ్.. ఇటీవల జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ రూ.30 లక్షలకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

## 'అల్లు'కు అరుదైన గౌరవం



విద్యా సదస్సులో ప్రసంగిస్తున్న అల్లు అప్పన్న

జలుమూరు: వమరవల్లి డైట్ అధ్యాపకుడు, శ్రీముఖలింగం గ్రామానికి చెందిన అల్లు అప్పన్నకు అరుదైన గౌరవం దక్కింది. జాతీయ విద్యా పరిశోధన శిక్షణా సంస్థ(న్యూ ఢిల్లీ) ఆధ్వర్యంలో శనివారం మైసూరులో నిర్వహించిన జాతీయ విద్యా సదస్సులో ఆయన ప్రసంగించారు. ఉన్నత పాఠశాల స్థాయి విద్యార్థులు-కెరీర్ మదింపుపై అధ్యయనం అనే అంశంపై పరిశోధన నివేదిక అందజేశారు. దేశవ్యాప్తంగా 78 మంది ప్రతినిధులు హాజరుకాగా, అందులో శ్రీకాకుళం నుంచి అల్లు అప్పన్న ప్రసంగించి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అప్పన్నను డీఈఓ తిరుమల చైతన్య, గ్రామస్తులు అభినందించారు.

# ప్రాణాలు తీసిన వివాహేతర సంబంధాలు

జిల్లాలో ఇటీవల వేర్వేరు చోట్ల జరిగిన అనుమానాస్పద మృతుల కేసులను పోలీసులు ఛేదించారు. రెండు ఘటనలకూ వివాహేతర సంబంధాలే కారణమని నిర్ధారించారు. ఆయా కేసుల్లో నిందితులను అరెస్టు చేసి విలేకరులకు వివరాలు వెల్లడించారు.

## భర్త హత్యలో భార్యే సూత్రధారి



వివరాలు వెల్లడిస్తున్న శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద

- వివాహేతర సంబంధానికి అడ్డుగా వస్తున్నాడని ఘాతుకం
- దాడి చేసి చంపేసిన ప్రియుడు, అతని స్నేహితులు

ఆమదాలవలస: మండలంలోని బొబ్బిలిపేట సమీపంలో గత నెల 25వ తేదీ రాత్రి జరిగిన గురుగుబిల్లి చంద్రయ్య హత్య కేసు మిస్టరీ వీడింది. హత్య కేసులో రాజకీయ కోణం లేదని, కేవలం వివాహేతర సంబంధమే ఈ ఘటనకు కారణమని, ఇందులో ప్రమేయమున్న 10 మందిని శనివారం అరెస్టు చేసినట్లు శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకనంద తెలిపారు. ఈ మేరకు ఆమదాలవలస పోలీస్ స్టేషన్‌లో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. గరుగుబల్లి చంద్రయ్య భార్య ఈశ్వరమ్మకు అదే గ్రామానికి చెందిన చింతాడ బాలమురళీకృష్ణకు కొన్నాళ్లుగా వివాహేతర సంబంధం నడుస్తోంది. విషయం తెలుసుకున్న భర్త చంద్రయ్య భార్యను మందలించి సెల్‌ఫోన్ వాడకుండా కట్టుదిట్టం చేయడంతో పాటు బాలమురళీకృష్ణతో ఉన్న ఆర్థిక లావాదేవీలను కూడా నిలుపుదల చేశాడు. దీంతో కక్షపెంచుకున్న బాలమురళీకృష్ణ చంద్రయ్యకు తెలియకుండా మరొక ఫోన్‌తో ఈశ్వరమ్మతో రహస్య సంభాషణలు సాగించేవాడు. ఈ క్రమంలో తమకు అడ్డంగా ఉన్న చంద్రయ్యను చంపాలనే ఉద్దేశంతో తన సోదరుడు, శ్రీనివాసచార్యులపేటకు చెందిన గురుగుబిల్లి అరవింద్ సాయం తీసుకున్నాడు. అతను తన స్నేహితులైన బూర్జ మండలం ఉప్పినవలసకు చెందిన వంశీ, గణేష్‌లను కూడా రంగంలోకి దించాడు. వీరంతా కలిసి చంద్రయ్యను హతమార్చడానికి బొబ్బిలిపేట సమీపంలో చెరువు వద్ద రెండు రోజులు మాటువేసినా ఫలితం లేకపోయింది. ఈ 25న చంద్రయ్య ఇంటి వద్ద బయలుదేరిన వెంటనే భార్య ఈశ్వరమ్మ చెరువు వద్ద ఎదురుచూస్తున్న బాలమురళీకృష్ణకు ఫోన్ చేసి చెప్పింది. స్కూటీపై వస్తున్న చంద్రయ్యను వీరంతా అడ్డగించి బీరు సీసాలు, కర్రలతో మూకుమ్మడిగా దాడి చేసి హతమార్చారు. మృతదేహాన్ని పక్కనే ఉన్న చెరువులోకి ఈడ్చుకెళ్లి తుప్పల చాటున పడేశారు. అదే రోజు రాత్రి భార్య ఈశ్వరమ్మ ముందుగా భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మళ్లీ అర్ధరాత్రి సమయంలో తన భర్త శవంగా పొలాల్లో పడి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ ఎస్.బాలరాజు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. విచారణలో బొబ్బిలిపేటకు చెందిన చింతాడ బాలమురళీకృష్ణ ప్రథమ నేరస్తుడుగా, ఉప్పినవలసకు చెందిన గొల్లపల్లి వంశీ, సవలాపురం గణేష్, బొబ్బిలిపేటకు చెదిన చంద్రయ్య భార్య జి.ఈశ్వరమ్మలను తదుపరి నేరస్తులుగా, సవలాపురం ప్రవీణ్, బొమ్మాళి శ్రీవర్ధన్(శివ), బొమ్మాళి ఉమామహేష్, ఈసర్లపేటకు చెందిన యర్లంకి కృష్ణ, శ్రీనివాసాచార్యులపేటకు చెందిన గురుగుబెల్లి అరవింద్‌లతో పాటు మరో మైనర్‌కు కూడా నేరంలో ప్రమేయమున్నట్లు గుర్తించారు. వీరందరినీ అరెస్టు చేసి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అనుమానాస్పద హత్యగా కేసు నమోదు చేసిన తక్కువ సమయంలో మిస్టరీని ఛేదించిన సీఐ, ఎస్ఐ, సిబ్బందిని ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, డీఎస్పీ వివేకానంద అభినందించారు.

## అనుమానమే పెనుభూతమై..


వివరాలు వెల్లడిస్తున్న కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు

- వీడిన జీడి కార్మికుడి హత్య కేసు
- భార్యతో చనువుగా ఉంటున్నాడని యువకుడి దారుణ హత్య

కాశీబుగ్గ: పలాసలో వారం రోజుల కిందట సంచలనం రేపిన గుర్తు తెలియని మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. భార్యతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడనే అనుమానంతో యువకుడిని అతని స్నేహితుడే హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈ ఘటనకు సంబంధించి కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ఎం.వెంకటఅప్పారావు శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. కాశీబుగ్గ ఎస్సీవీధికి చెందిన కామిటి శ్రీను, సవర జాన్ స్నేహితులు. కాశీబుగ్గ పారిశ్రామికవాడలో ఓ జీడి పరిశ్రమలో పనిచేస్తుండేవారు. శ్రీను తరచూ జాన్ ఇంటికి వెళుతుండేవాడు. అవివాహితుడైన శ్రీను భోజనం కూడా జాన్ ఇంట్లోనే చేసేవాడు. ఈ క్రమంలో తన భార్యతో శ్రీను వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని జాన్ అనుమానం పెంచుకున్నాడు. ఎలాగైనా శ్రీనును చంపాలని నిర్ణయించుకున్నాడు. గత నెల 24న సాయంత్రం మూడు గంటల సమయంలో శ్రీను ఇంటికి జాన్ వెళ్లాడు. అక్కడి నుంచి ఇద్దరూ కోసంగిపురం వెళ్లి పూటుగా సారా తాగారు. తిరిగి కాశీబుగ్గ వెళుతుండగా సబ్ స్టేషన్ సమీపంలోని కాలనీ వద్ద ఐరన్ రాడ్‌తో శ్రీను తలపై మోదాడు. దీంతో శ్రీను (26) అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం ఏమీ తెలియనట్టు జాన్ వచ్చేశాడు. మరుసటిరోజు మరోసారి మృతదేహం వద్దకు వెళ్లి శ్రీను చనిపోయినట్టు నిర్ధారించుకున్నాడు. ఇంతలో శ్రీను తల్లి కామిటి నీలమ్మ కుమారుడు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు తన కోసం గాలిస్తున్నట్టు తెలుసుకున్న జాన్ కోసంగిపురం పంచాయతీ కార్యదర్శి వద్దకు వెళ్లి శ్రీనును తానే హత్య చేసినట్టు అంగీకరించాడు. అనంతరం కాశీబుగ్గ పోలీసులకు లొంగిపోయాడు. విలేకరుల సమావేశంలో కాశీబుగ్గ పట్టణ సీఐ పి.సూర్యనారాయణ, హెచ్‌సీ శ్రీనువాసరావు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్త డీజీపీని కలిసిన ఎస్పీ



డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాని కలిసిన ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : రాష్ట్ర కొత్త డీజీపీగా బాధ్యతలు చేపట్టిన హరీష్‌కుమార్ గుప్తాను జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం రాష్ట్ర పోలీస్ కార్యాలయంలో డీజీపీని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

## ధాన్యం తిని 40 గొర్రెలు మృతి

టెక్కలి రూరల్: మండలంలోని గూడేం పంచాయతీ పిట్టలసరియా గ్రామంలో శనివారం ధాన్యం తిని సుమారు 40 గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పిట్టలసరియా గ్రామానికి చెందిన గండేటి అప్పలస్వామి, అంబల మల్లేషు, జోగ గంగయ్యలు తమ గొర్రెలను నందిగాం మండలం బడబంద సమీపంలోకి మేతకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో పొలంలో ఎన్నులు, ధాన్యం గింజలు తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. వాటిలో గండేటి అప్పలస్వామికి చెందిన 32 గొర్రెలు, మల్లేషు, జి.గంగయ్యలకు చెందిన 8 గొర్రెలు మృతిచెందినట్లు బాధిత రైతులు తెలిపారు. వీటి విలువ రూ.5లక్షలకు పైగా ఉంటుందని చెప్పారు. విషయం తెలుసుకున్న అధికారులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

## విద్యార్థులను వేధిస్తున్నారు


ఫీజు రీయింబర్స్‌మెంట్ ధర్నా పోస్టర్‌ను విడుదల చేస్తున్న నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త పిరియా విజయ తదితరులు

కంచిలి: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టి కూటమి ప్రభుత్వం విద్యార్థులను వేధిస్తోందని ఇచ్ఛాపురం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆరోపించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 5వ తేదీన పార్టీ అధిష్టానం పిలుపుమేరకు వైఎస్సార్ సీపీ చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఆమె క్యాంపు కార్యాలయం బల్లిపుట్టుగ గ్రామంలో ఈ నెల 5న చేపట్టనున్న ధర్నా కార్యక్రమ పోస్టర్‌ను శనివారం సాయంత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్‌రెడ్డి, సోంపేట ఎంపిపి డాక్టర్ నిమ్మన దాస్, ఇచ్ఛాపురం ఎంపిపి బోర పుష్ప, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు రాంపత్ని చిట్టిబాబు, సోంపేట మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యచంద్రుల వైభవం


అరసవల్లిలో శనివారం సాయంత్రం వేళ సూర్యనారాయణ స్వామి ఆలయం శిఖరాన నెలవంక కనువిందు చేసింది. రథసప్తమి నేపథ్యంలో ఆలయ పరిసరాలన్నీ విద్యుద్దీప కాంతులతో మెరిసిపోతున్న వేళ ఈ దృశ్యం ఆవిష్కృతమైంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం


## మహా కుంభమేళాకు టెక్కలి నుంచి ఆర్టీసీ బస్సులు

టెక్కలి: ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు టెక్కలి, పలాస డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు సేవలు అందజేస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 12వ తేదీ సాయంత్రం 3 గంటలకు బయల్దేరి ప్రయాగరాజ్ దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో త్రివేణి సంగమం, కాశీ విశ్వేశ్వరస్వామి జ్యోతిర్లింగం, కాశీ అన్నపూర్ణ, కాశీ విశాలాక్షి, మహాబోధి ఆలయం, శ్రీ విష్ణుపాద ఆలయం, మంగళగౌరీ శక్తి పీఠం, కోణార్క్ సూర్యదేవాలయం, పూరీ, భువనేశ్వర్ లింగరాజు ఆలయం దర్శనం అనంతరం టెక్కలి చేరుకోనున్నట్లు డీఎం వెల్లడించారు. ఏడు రోజులు కొనసాగనున్న ఈ యాత్రకు అల్పాహారం, భోజనంతో కలిపి ఒక్కొక్కరికి రూ.9500 టికెట్‌గా నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 9959225611, 7382923311, 7382923507 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

## పశువుల అక్రమ రవాణా అడ్డగింత

సోంపేట: పశువులను పరిమితికి మించి అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని బారువ ఎస్ఐ హరిబాబునాయుడు అన్నారు. మండలంలోని కొర్లాం జాతీయ రహదారి వద్ద ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వ్యాన్‌లో తరలిస్తున్న 22 గేదెలను శనివారం ఉదయం పట్టుకున్నారు. గేదెలను గోశాలకు తరలించారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్, క్లీనర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

## మరో రెండు మద్యం షాపులు మంజూరు


మాట్లాడుతున్న సీఐ గోపాలకృష్ణ

శ్రీకాకుళం క్రైమ్ : నూతన మద్యం పాలసీలో భాగంగా శ్రీకాకుళం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో అదనంగా రెండు మద్యం దుకాణాలు మంజూరయ్యాయని సీఐ ఎం.వి.గోపాలకృష్ణ శనివారం తెలిపారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సెగిడి కులస్తులకు, శ్రీకాకుళం మండల పరిధిలో సొండి కులస్తులు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, రూ.2 లక్షల డీడీని డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్, శ్రీకాకుళం పేరిట తీసి ఎక్సైజ్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. సెగిడి కులస్తులకు ఈ నెల 7న అంబేద్కర్ ఆడిటోరియంలో, సొండి కులస్తులకు ఈ నెల 8న కలెక్టర్ కార్యాలయంలో డ్రా తీస్తామని పేర్కొన్నారు.